ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
సోమవారం 16 డిసెంబరు 2024





నేటి నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16(నేటి) నుంచి 19 వరకు సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు తెలిపారు. నేడు హకీంపేట్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో యోగా, చెస్, జూడో, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. కీసర ఓఆర్ఆర్ ప్రాంతంలో సైక్లింగ్, లాలాగూడలో బాక్సింగ్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ సెలక్షన్లు ఉంటాయన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయన్నారు. 18న కబడ్డీ, అథ్లెటిక్స్ ఉప్పల్ భగాయత్‌లో బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. ఉప్పల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో కిక్ బాక్సింగ్, అల్వాల్ పల్లవి స్కూల్‌లో నెట్ బాల్ సెలక్షన్లు నిర్వహిస్తామన్నారు. 19న జింఖానా గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ సెలక్షన్లు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్లతో పాటు పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, 10వ తరగతి మెమో, 2 పాస్ ఫోటోలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9912770801, 7660919518 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు

వికారాబాద్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేడు జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో అధికారులు పరీక్ష విధులకు హాజరు కావడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.



ఓ ఇంటివద్ద అర్హురాలి ఫొటోను చిత్రీకరిస్తున్న సర్వేయర్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే షురూ

- ఈ నెల 31 వరకు వివరాల సేకరణ
- ప్రత్యేక మొబైల్ యాప్‌తో డాటా ఎంట్రీ


తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే షురూ అయ్యింది. ఆదివారం సర్వేయర్లు వార్డుల్లో తిరిగి ప్రత్యేక మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఇంటి స్థితితో పాటు ఫొటోలు తీసుకున్నారు. కాగా, ఈ సర్వేను ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్ చొప్పున నియమించింది. సర్వేయర్ తప్పనిసరిగా లబ్ధిదారుడితో ఒక ఫొటో, రూఫ్ స్థితి, గదుల స్థితికి సంబంధించి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సొంత ఇళ్ల లేదా కిరాయి.. తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డుల్లో 12,728 దరఖాస్తులు గుర్తించబడ్డాయి. అయితే, ప్రతీ నియోజకవర్గానికి మొదటి ఏడాది 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం కేటాయించనుంది. మొదటగా నిరుపేదలై ఇంటి స్థలాలు ఉన్నవారికి ఇళ్లను కేటాయించనున్నారు. వారికి 4 విడతలుగా రూ.5లక్షల ఆర్థికసాయం ప్రభుత్వం అందజేయనుంది. ఇందుకుగాను లబ్ధిదారులను మొబైల్ యాప్ ద్వారా గుర్తించనున్నారు.

అంతర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు శంకర్‌సింగ్



మేడ్చల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ పట్టణానికి చెందిన ఎక్స్‌ట్రీమ్ జిమ్ ఫిట్‌నెస్ కోచ్ శంకర్ సింగ్.. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ మజిల్ మెన్ పోటీల్లో ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి మజిల్ మెన్ పోటీల్లో శంకర్ సింగ్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. దేశం నలుమూలల నుంచి చాలా మంది పోటీల్లో పాల్గొనగా శంకర్‌సింగ్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాగా, పోటీల్లో భాగంగా డెడ్‌లిఫ్ట్, పుషప్స్ వంటి విభాగాల్లో ప్రతిభ కనబరిచినట్లు శంకర్ పేర్కొన్నాడు.

పరిగి మండలంలోని ఓ జిన్నింగ్ మిల్లులో ఇలా..



మాయాజాలం!

వ్యాపారుల మాయాజాలంతో జిల్లాలో పత్తి రైతులు చిత్తవుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండడంతో అమ్మకాల్లో భారీ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. తక్కువ ధర, తూకం, తేమ పేరుతో దగా చేస్తున్నారు. రైతులు పండించిన పత్తిని మొత్తం సీసీఐలో కొనుగోలు చేయని పరిస్థితి. దీంతో జిన్నింగ్ మిల్లుల అడ్డాగా దళారుల హవా కొనసాగుతోంది. తేమ పేరుతో కొర్రీలు పెడుతుండడంతో పత్తిని సీసీఐకి తీసుకెళ్లినా అమ్ముకునే పరిస్థితి లేదు. దీంతో అక్కడే దళారులకు తక్కువ ధరకైనా అమ్ముకోవాల్సిన పరిస్థితి. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి ప్రాంతాల్లో మొత్తం 14 కాటన్ మిల్లులు ఉన్నాయి. ప్రభుత్వం ఏ గ్రేడ్ పత్తి క్వింటాల్‌కు రూ.7,521, బీ-గ్రేడ్ రూ.7,220లుగా నిర్ణయించింది.

జిన్నింగ్ మిల్లుల్లో ఇష్టారాజ్యం!

- సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలుకు కొర్రీలు
- దీంతో తక్కువ ధరకే వ్యాపారుల కొనుగోళ్లు
- తత్కాల్ పద్ధతిలో సాగు వివరాలు నమోదు
- మళ్లీ అధిక ధరకు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయాలు
- పత్తి అమ్మకాలను పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పత్తి రైతులు

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జిన్నింగ్ మిల్లుల వ్యాపారుల కనుసన్నుల్లోనే పత్తి వ్యాపారం సాగుతోంది. సీసీఐ కేంద్రాల్లో నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టడం ద్వారా రైతులు వారికి అమ్మేందుకు వెనకాడుతున్నారు. దీంతో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల మాదిరిగా అమ్ముకుందామన్నా మార్కెట్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పత్తి రైతులు జిన్నింగ్ మిల్లులకు వెళ్లకుండానే బయట అమ్ముకుంటున్నారు. జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు కూడా గ్రామాల్లోకి వెళ్లి కొనడం, లేదా రైతులే జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లి పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి. పత్తి విక్రయాల్లో మార్కెటింగ్ అధికారులు

మిగతా 8వ పేజీలో...

కనిపించని సాగు వివరాలు



మాకు ఐదున్నర ఎకరాల పొలం ఉంది. ఐదేళ్లుగా పత్తినే సాగు చేస్తున్నా. అయితే ఈ సారి అర ఎకరమే సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. ఐదు ఎకరాల్లో పండిన పత్తిని ఎలా, ఎవరికి అమ్ముకోవాలి. సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో ఉంటేనే సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేస్తామంటున్నారు. అదే అధికారులు కొందరికి సాగు చేయకున్నా చేసినట్లు రాసి ఇస్తున్నారు. దీంతో నిజమైన రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కానీ, వ్యాపారులకు మాత్రం తత్కాల్ పేరుతో రాసిస్తున్నారు.

-నారాయణ, రైతు, రాఘవాపూర్, పరిగి మండలం

- పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు
- ఆలస్యం కారణంగా 69 మందికి అనుమతి నిరాకరణ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

తొలిరోజు గ్రూప్-2 ప్రశాంతం

పేపర్-1లో 49.58 శాతం, పేపర్-2లో 49.46 శాతం హాజరు

వికారాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్ష తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పేపర్-1, పేపర్-2 పరీక్షలకు 69 మంది అభ్యర్థులు అయిదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. పేపర్-1 పరీక్షకు 62 మంది, పేపర్-2 పరీక్షకు 7 మందిని ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రంలోకి పంపించలేదు. వికారాబాద్ రీజియన్ పరిధిలో 59 మంది, తాండూరు రీజియన్ పరిధిలో 10 మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశాన్ని కోల్పోయారు. 30 కేంద్రాల్లో నిర్వహించగా పేపర్-1 పరీక్షకు 10,381 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 5,147 మంది హాజరయ్యారు. పేపర్-2 పరీక్షకు 5,135 మంది హాజరయ్యారు. పేపర్-1 పరీక్షకు 49.58 శాతం హాజరు కాగా, పేపర్-2 పరీక్షకు 49.46 శాతం హాజరయ్యారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు, పోలీసు అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించగా, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఓ పరీక్ష కేంద్రం వద్ద మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



కీసరలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ చూపుతున్న అభ్యర్థులు

మేడ్చల్ జిల్లాలో 116 పరీక్ష కేంద్రాలు

మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో గ్రూప్-2 పరీక్షకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మొత్తం 72,999 మంది అభ్యర్థులకు 116 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు కారణంగా అరగంట ముందుగానే గేట్లు మూసివేశారు. కీసరలోని ఓ పరీక్షా కేంద్రంకు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థినిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ షాపులను మూసివేయించారు.

పండగలా వ్యవసాయం

- హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు
- పామాయిల్ రైతులకు ప్రోత్సాహం
- మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క
- పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం



మంత్రులకు నాగలి అందజేస్తున్న పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశరాంరెడ్డి

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులు రాజధానికి దగ్గరగా ఉండడం అదృష్టమని, ఏ ఉత్పత్తులనైనా సులభంగా మార్కెట్ చేసుకునే వెసులుబాటు ఉందని, పండగలా సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి సీతక్క, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జిల్లాలో హోల్‌సేల్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యాపారులే రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. అలాగే జిల్లాలో ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు స్థాపించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే ఆయిల్ పామ్ ప్రైవేట్ కంపెనీ ఏర్పాటుకు అనుమతి కూడా ఇచ్చామని తెలిపారు.

రూ.7,333 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ చదువుకున్న అందరికీ ఉద్యోగాలు కావాలంటే సాధ్యం కాదని, వ్యవసాయంపై యువత దృష్టి సారించాలని సూచించారు. పంటల సాగు ఒక పండుగలా కొనసాగాలన్నారు. శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై భారం ఉన్నప్పటికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని చెప్పారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాది పాలనలో

మిగతా 8వ పేజీలో...

- కైలాసపురి పత్రీజీ శక్తి స్థల్‌లో ప్రారంభమైన ఏర్పాట్లు
- ధ్యాన మహాయాగం చైర్మన్‌గా కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి

మహాపిరమిడ్ ముస్తాబు

21 నుంచి పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు

వివరాలు 7లో..



సర్వాంగ సుందరంగా మహేశ్వర మహాపిరమిడ్

ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్.. ధ్యాన మహోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 21వ తేదీ నుంచి 31 వరకు కొనసాగే పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలకు పిరమిడ్ స్పిర్చ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

కడ్తాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)

మాస్టర్ ప్లాన్-2050

- అమృత్ 2.0లో భాగంగా జీఐఎస్ ఆధారిత సర్వే
- 25 ఏళ్లకు అనుగుణంగా 'బృహత్తర ప్రణాళిక'
- తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో డ్రోన్ సర్వే పూర్తి

6



మా భూములు మాకివ్వండి!

అటవీ శాఖ అధికారులను కోరిన రైతులు

- అర్బన్ పార్కు ఏర్పాటు పేరిట స్వాధీనం
- తాండూరు అంతారంలో ఘటన

7



సమీక్షిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

- పారిశ్రామిక కారిడార్ ప్రత్యేక అధికారిగా గుర్తింపు
- పాలనలో వంద రోజులు పూర్తి చేసుకున్న సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్

8



'అనంతగిరి'లో పార్కింగ్, కొబ్బరికాయల విక్రయానికి 18న వేలం

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న అనంతగిరి శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పార్కింగ్ ఫీజు వసూలు, కొబ్బరికాయల విక్రయానికి సంబంధించిన హక్కుల కొరకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో టి.నరేందర్ తెలిపారు. ఏడాది కాల పరిమితికి.. 2025 జనవరి 1 నుంచి డిసెంబరు 31వరకు పార్కింగ్, విక్రయాలకు హక్కు ఉంటుందన్నారు. కార్తీక మాసం మినహాయించి కొబ్బరికాయలు అమ్ముకునే హక్కుపై 18న వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటలకు అనంతగిరి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని, పాల్గొనదలచినవారు డిపాజిట్‌కింద రూ.లక్ష చెల్లించాలన్నారు. హక్కు పొందనివారికి డిపాజిట్ వాపస్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పాముకాటుతో బాలిక మృతి


సంగీత(ఫైల్)

దౌల్తాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. 17 ఏళ్ల క్రితం నందారం గ్రామానికి కుటుంబంతో వలస వచ్చిన సంగీత (17) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో చిన్న గుడిసె ఏర్పాటు చేసుకొని తల్లి రంగమ్మతో ఉంటూ బిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గుడిసెలో ఉండగా సంగీత పాముకాటుకు గురైంది. వెంటనే తల్లి రంగమ్మ గ్రామస్థులకు సమాచారం అందించింది. అనంతరం కొడంగల్‌కు తరలించారు. అక్కడి నుంచి తాండూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా.. గంటసేపటి వరకు రాలేదు. అయితే, అప్పటికే బాలిక మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు డబ్బు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

యాలాల డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల కమిటీని మండల కేంద్రంలో ఆదివారం మండల ఇన్‌చార్జి డప్పు మహేందర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు. మండలాధ్యక్షుడిగా సూర్యప్రకాష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పకీరప్ప, ఉపాధ్యక్షుడిగా సాయిలు, లాలప్ప, అధికార ప్రతినిధి శ్రవణ్, కార్యదర్శిగా నవీన్, సలహాదారుగా మెట్లి కృష్ణ, కార్యవర్గసభ్యులుగా నర్సింహులు, రాంచందర్, నరేష్‌లను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్-2050

- అమృత్ 2.0లో భాగంగా జీఐఎస్ ఆధారిత సర్వే
- 25 ఏళ్లకు అనుగుణంగా 'బృహత్తర ప్రణాళిక'
- మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో డ్రోన్ సర్వే పూర్తి
- డీటీసీపీకి నివేదిక అందజేత


డ్రోన్ కెమెరాతో సర్వే చేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0లో భాగంగా జీఐఎస్(జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) ఆధారిత మాస్టర్ ప్లాన్ సర్వే పూర్తయ్యింది. ఇందులో భాగంగా డ్రోన్ సర్వేను సర్వే ఆఫ్ ఇండియా, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా బృహత్తర ప్రణాళికతో చేపట్టారు. రాబోయే తరాల అవసరాల నిమిత్తం 'మాస్టర్ ప్లాన్- 2050'కి ఈ డ్రోన్ సర్వేలో గుర్తించిన అంశాల ఆధారంగా ప్రణాళికలను రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన డ్రోన్ పైలెట్స్ వరప్రసాద్, గోపాల్‌లు తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో దాదాపు నెల రోజుల పాటు సర్వే చేపట్టారు. ఈ రెండు మున్సిపాలిటీలకు సంబంధించి డ్రోన్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్‌లను డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగానికి సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అందజేశారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ ను తయారు చేయనున్నారు.

15 రోజుల పాటు డ్రోన్ సర్వే

వికారాబాద్ జిల్లాలో ఎంపికైన వికారాబాద్ మున్సిపాలిటీలో అక్టోబరు 16 నుంచి 24 వరకు, తాండూరులో అక్టోబరు 28న ప్రారంభమై నవంబరు 8 వరకు డ్రోన్ సర్వేను చేపట్టారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు, తాండూరు మున్సిపాలిటీలో 36 వార్డుల ఏరియాల్లో ప్రతీ 2 కిలోమీటర్లకు ఒక కంట్రోల్ పాయింట్‌తో భౌగోళిక ప్రాంతాలను గుర్తించారు. తాండూరులో 46 కంట్రోల్ పాయింట్ల ద్వారా సర్వే నిర్వహించారు.

25 ఏళ్లకు సరిపడా ప్రణాళిక

కేంద్ర ప్రభుత్వం రాబోయే 25 ఏళ్ల వరకు సంబంధించి పట్టణాల్లో పెరుగుతున్న మౌలిక వసతుల కల్పన, సమగ్రాభివృద్ధి కొరకు మాస్టర్ ప్లాన్ ద్వారా అమలు చేసే దిశగా డ్రోన్ సర్వేను చేపట్టింది. 25 ఏళ్లకు ఉపయోగపడేలా.. మున్సిపాలిటీ ఉపరితలం ఎత్తు, కుంటలు, చెరువులు, విస్తీర్ణం, చెరువులు, మార్కెట్ యార్డులు, సెల్‌టవర్లు, డ్రైనేజీ, రోడ్లు, ప్రధానమైన పంటలు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, సర్వే నంబర్‌ల వారీగా ప్లాన్, కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ల వారీగా రవాణా సదుపాయాలు, వ్యవసాయ భూమి, ఇళ్లు, చెట్లు, వాటర్ ట్యాంకులు, రైల్వే, బస్‌స్టేషన్లు, సాగు, తాగునీటి వనరులను డ్రోన్ సర్వే ద్వారా మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్‌ను, ఛాయా చిత్రాలను అనుసరించి భవిష్యత్తు తరాల అవసరాలకు తగ్గట్టుగా తయారు చేయబోయే మాస్టర్ ప్లాన్‌కు ఈ డిజిటల్ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్లానింగ్ పూర్తికి ఆరు నెలల సమయం

క్షేత్రస్థాయిలో చేపట్టిన డ్రోన్ సర్వే చిత్రాలు, రికార్డులను ఆసరాగా చేసుకొని 20 ఏళ్లకు పైబడిన మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయనున్నారు. అమృత్ 2.0లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా జిల్లాలో వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీలు ఎంపికయ్యాయి. వికారాబాద్ మున్సిపాలిటీలో 21.12 స్క్వేయర్ కిలోమీటర్లు, తాండూరులో 21.02 స్క్వేయర్ కిలోమీటర్ల పరిధిని గుర్తించినట్లు డీటీసీపీ అర్బన్ ప్లానర్ హరిత తెలిపారు. తాండూరులో 6 వేల ఎకరాల విస్తీర్ణం గుర్తించమన్నారు. ఈ సర్వే నివేదికను డీటీసీపీ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు. సేకరించిన వివరాల ప్రకారం ప్రణాళికను పూర్తి చేసేందుకు ఆరు నెలల గడువు పడుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఇద్దరు ప్రతినిధులం డ్రోన్ సర్వే చేశామని అందులో ఒకరైన వరప్రసాద్ తెలిపారు. ఛాయ చిత్రాలు తీసి సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి అందజేశామన్నారు. 50 లక్షల జనాభా గల పట్టణాల్లో డ్రోన్ సర్వేను చేపట్టామని, పట్టణాలకు కావాల్సిన అవసరాలను సర్వే ద్వారా గుర్తిస్తారని పేర్కొన్నారు.

గర్వంగా ఉంది



తన పదవీ కాలంలో 20 ఏళ్లకు, భవిష్యత్తు తరాలకు అవసరమయ్యే ప్రణాళికను తయారు చేయడం అదృష్టంగా భావిస్తున్నా. పాలక మండలి సభ్యులందరి సహకారంతో రాబోయే తరాలకు అవసరమయ్యే మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నా. ముఖ్యంగా తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటల్లో విలీనమైన ప్రాంతాలకు మాస్టర్ ప్లాన్-2050 ఎంతో ఉపయోగపడుతుంది. అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి. తాండూరులో విలీన ప్రాంతలైన ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, కోకట్ రోడ్డు మార్గాలు అభివృద్ధి చెందే అవకాశాలుంటాయి.

- స్వప్న, మున్సిపల్ చైర్‌పర్సన్, తాండూరు

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ

పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అందించిన డ్రైవర్, కండక్టర్

పరిగి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగి నుంచి షాద్‌నగర్ వెళుతున్న బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధ మహిళ పర్సు పోగొట్టుకుంది. పరిగి మండలం చిట్యాల్ గ్రామానికి చెందిన అమీనాబీ ఆదివారం పరిగి బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి చిట్యాల్‌లో దిగిపోయింది. ఈక్రమంలో బస్సు సీట్లో పడి ఉన్న ఆమె పర్సును మరో ప్రయాణికుడు తీసుకుంటుండగా కండక్టర్ శ్యామల గమనించింది. అది నీది కాదు కదా.. ఎలా తీసుకుంటావ్.. అని చెప్పి ప్రయాణికుడి నుంచి తీసుకుంది. కాగా, పర్సులో రూ.10వేల నగదు, ఆధార్‌కార్డు ఉంది. దాంతో ఆధార్ కార్డు ఆధారంగా చిట్యాల్ గ్రామానికి చెందిన అమీనాబీదిగా గుర్తించారు. గ్రామానికి వెళ్లి రూ.10వేల నగదు, పర్సును బాధిత మహిళకు అందజేశారు. దాంతో స్థానికులు డ్రైవర్,కండక్టర్లను అభినందించారు.


అమీనాబీకి పర్సు అందిస్తున్న కండక్టర్, పక్కన డ్రైవర్

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో భక్తులు

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం రథోత్సవం, భజన పోటీలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి తాళ్లతో రథాన్ని లాగి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవంలో రాంపూర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పవన్ కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, స్థానిక మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మాజీ ఎంపీపీలకు మాతృవియోగం

నివాళులర్పించిన సబితారెడ్డి, మహేందర్‌రెడ్డి, యాదయ్య


నివాళులర్పిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మాజీ ఎంపీపీలు మల్గారి విజయలక్ష్మి రమాణారెడ్డి, మల్గారి విజయ్‌భాస్కర్‌రెడ్డిలకు మాతృవియోగం కలిగింది. వారి తల్లి రాములమ్మ(92) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు ఆదివారం ఉదయం మృతదేహానికి పూలతో నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, చేవెళ్ల మండల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.


అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


వివరాలు సేకరిస్తున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇళ్ల అందించేందుకు కృషి చేస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని 33వ వార్డు బీటీఎస్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పర్యవేక్షించారు. వార్డు కమిటీ సభ్యులు, మునిసిపల్ వార్డు ఆఫీసర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భజన భక్తులకు సన్మానం

చేవెళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పామెన గ్రామంలో కార్తీక మాసంలో 41 రోజుల పాటు హనుమాన్ దేవాలయంలో ప్రతీ రోజు భజనలు చేసిన భజన భక్తులను గ్రామానికి చెందిన బీజేపీ యువమోర్చా మండలాధ్యక్షుడు కృష్ణమోహన్ ముదిరాజ్ ఆదివారం గ్రామంలో ఉన్న భజన భక్తులను అభినందించడంతో పాటు రూ. 5వేల ఆర్థిక సాయం అందించి సత్కరించాడు. కార్యక్రమంలో భజన భక్తులు రాములు, నర్సింలు, గోపాల్, శేఖర్, రాంచంద్రయ్య, అంజయ్య, శివనాగం, ఆత్మలింగం, సదానందం, శ్రీశైలం, ప్రసాద్‌కుమార్, విజయ్, రవి, కృష్ణ, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.


భజన భక్తులకు ఆర్థిక సాయం అందిస్తున్న కృష్ణమోహన్

మెరుగైన వైద్యం అందించాలి


లీలావతిని పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితమైన ఆహారం తిని అస్వస్థతకు గురైన పెద్దేముల్ మండలం బాయిమీది తండాకు చెందిన విద్యార్థిని లీలావతికి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం రాత్రి నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాలికకు అందిస్తున్న వైద్యసేవలపై ఆర్‌ఎంవోతో చర్చించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. లీలావతి తండ్రి తారాసింగ్‌తో మాట్లాడి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మిగతా విద్యార్థులు కూడా కోలుకుంటున్నారని, లీలావతి ఒక ట్రెండు రోజుల్లో కోలుకుంటుందని చెప్పారు. కాగా, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హాస్టల్ ఇన్‌చార్జి వినోద్‌ను ఆయన ఫోన్‌లో ఆదేశించారు.

దేవుని పడకల్ ఆలయంలో నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు


వేంకటేశ్వర స్వామి ఆలయం

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ గోదాదేవి ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైంది. నేటి(సోమవారం) నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాస వేడుకలు జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతాయి. నెల రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. భక్తులకు విశాల వసతులు కల్పించారు. ప్రతీరోజు అర్చన, మహానివేదన, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, ధర్మకర్త రామాచార్యులు తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి వేడుకలు, ఉత్తర ద్వారా ప్రవేశ దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 13న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధనుర్మాస వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం కోరారు.

మహిళల అత్యాచారాలపై ఉద్యమించాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలపై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వి నేద పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. మద్యం, డగ్స్ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు సేవించడంతో పాటు చాలా చోట్ల మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నట్లు తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. మహిళల సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు.

ఐద్వా మేడ్చల్ మండల నూతన కమిటీ

ఐద్వా మేడ్చల్ మండల అధ్యక్షురాలిగా గౌతమి, ప్రధాన కార్యదర్శిగా అశ్విని, కోశాధికారిగా శ్రావణి, ఉపాధ్యక్షురాలిగా లత, సహాయ కార్యదర్శిగా జ్యోతిలను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పల్లవి, డాలి, స్వరూప, బాలమణి, భాషమ్మ, లూదియాలను ఎన్నుకున్నారు.

మా భూములు మాకివ్వండి!

అటవీ శాఖ అధికారులను కోరిన రైతులు


తాండూరు మండలం అంతారం శివారులో రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న భూమి

తాండూరు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మా భూములు మాకివ్వాలని రైతులు అటవీ శాఖ అధికారులను కోరారు. తమకున్న కాస్త భూమిని స్వాధీనం చేసుకోవడంతో ఎలా బతకాలని ఆందోళన వ్యక్తం చేశారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన రైతులు ఆదివారం మీడియాతో తమ బాధను వెల్లడించారు. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 58/2/అ లో రైతు వడ్డె సాయప్పకు గతంలో అసైన్డ్ భూమి ఉంది. అయితే, ఆయన మరణానంతరం కుటుంబికులైన వడ్డె జగదీశ్వర్‌కు 2 ఎకరాలు, వడ్డె అమృతమ్మకు 26గుంటలు, వడ్డె రాములుకు 14 గుంటలు, వడ్డె అంజిలప్ప 27 గుంటల చొప్పున భూమిని తమతమ పేర్లపై పట్టా చేసుకున్నారు. దాంతో వారు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. అయితే, అటవీశాఖ అధికారులు అర్బన్ పార్కు పేరిట తమ భూముల చుట్టూ కంచె వేసి స్వాధీనం చేసుకున్నారని రైతులు వాపోయారు. అక్రమంగా అధికారులు తమ భూమిని లాక్కున్నారని.. తమ వద్ద ఆధారాలున్నాయని వాపోయారు. కాగా, తమ వద్ద పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని, అటవీ అధికారులు మాత్రం ఫారెస్ట్ భూములంటూ చుట్టూ కంచె వేసి అందులోకి రానివ్వడం లేదని వాపోయారు. కాగా, అది ఫారెస్ట్ ల్యాండేనని, 2019లో అక్రమంగా రైతులు అటవీ భూమిలోకి వచ్చి ఆక్రమించుకున్నారని అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి తెలిపారు. కాగా, ఆ రైతులకు డంపింగ్ యార్డు పక్కనున్న ప్రభుత్వ భూమిలో పట్టా భూమి ఉందని, టైమ్‌లైన్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తే ఆ రైతుల భూమి ఫారెస్ట్ భూమిగా తేలిందని చెప్పారు. వాటర్ బాడీ వద్ద భూమిని ఆక్రమించుకున్నామని, ఫారెస్ట్ అధికారులు రైతుల భూమిని అక్రమించలేదని, తప్పుడు ప్రచారం చేయవద్దని తెలిపారు.

ఆరు గ్యారెంటీల పేరుతో మోసం

మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్


బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఆనంద్

వికారాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యేబీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కావలి మల్లేశం, ఖలీల్ పాషా, కురువ ప్రవీణ్, కురువ మల్లేశం, మహేష్ కుమార్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈమేరకు ఆనంద్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల సంగతి పక్కన పెడితే.. ప్రజా ధనాన్ని వృథా చేస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కనీస సమస్యలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల నిర్ణయాల వల్ల ఎంతోమంది నష్టపోయారన్నారు. తెలంగాణ తిరిగి అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుండాలంటే కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నాయకులు ఫయాజ్, మహిపాల్ రెడ్డి, అశోక్, మల్లేశ్, కావలి వెంకటేశ్, శ్రీనివాస్ గౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నానక్‌నగర్‌లో కల్వర్టు వద్ద మురుగు ఇలా..

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



మురుగు నిల్వకుండా తగిన చర్యలు తీసుకుంటాం. నీరంతా నేరుగా భూమిలోకి వెళ్లేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపడతాం. ప్రతీ గ్రామంలో వాడవాడలా, ఊరి చివరన భారీ ఇంకుడుగుంతలు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తాం. ప్రజలు తప్పకుండా వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి.

- శ్రీలత, ఎంపీవో, యాచారం

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- పల్లెల్లో పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన
- సమస్యలతో ప్రజలు సతమతం
- అధ్వానంగా మురుగు కాలువలు.. పేరుకుపోతున్న చెత్తాచెదారం
- తాగునీటి పైపులైన్లకు లీకేజీలు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వేడుకోలు

యాచారం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. దాంతో సమస్యల సుడిగుండంలో ప్రజలు సతమతమవుతున్నారు. పల్లెల్లో మురుగు కాలువల పరిస్థితి దయనీయంగా మారడంతో జనం దోమలతో వేగలేకపోతున్నారు. పలు గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకవడంతో నీరు కలుషితమవుతోంది. మురుగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే రోడ్లపై మురుగు పరుగు పెడుతోంది. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా మురుగు కాలువల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. మండల పరిధిలోని తాటిపర్తిలో నెల రోజుల క్రితం భూగర్భ డ్రైనేజీ పైప్ పగలడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. నానక్‌నగర్‌లో మురుగు నెల రోజులుగా రోడ్లపై పారుతోంది. పాఠశాల ఎదుట నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ ఇంకుడు గుంతలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మేడిపల్లిలో తూంబాయికుంటలోకి మురుగు నీరు చేరుతుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి నానక్‌నగర్ వెళ్లే దారిలో మురుగు ఎక్కడికక్కడే నిలుస్తోంది. అసంపూర్తి భూగర్భ డ్రైనేజీ పనులతో పాఠశాల నుంచి వెళ్లే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందిగా మారింది. చిన్నతూండ్లలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కల్వర్టు నుంచి పంట పొలాలకు గ్రామంలోని మురుగు నీరు వెళుతుంటుంది. అయితే, కల్వర్టు వద్ద మురుగు నిలుస్తుండటంతో దోమలకు నిలయంగా మారింది. చౌదర్‌పల్లిలోని డ్రైనేజీలో మురుగు ఎక్కడికక్కడే నిలుస్తోంది. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి కాలువలు దోమలకు నిలయంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి, నల్లవెల్లి గ్రామాల్లో మురుగు రోడ్లపై పారుతుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండల కేంద్రంలో పుడమి పాఠశాల వద్ద మురుగు నిలుస్తుండటంతో దోమల బెడద తట్టుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. గున్‌గల్‌లో హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారికి ఆనుకొని మురుగు నిలుస్తున్నా పంచాయతీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గున్‌గల్‌లోని పలు వీధుల్లో మురుగు ఏరులై పారుతోంది. కాగా, ప్రతీ గ్రామంలో భారీ ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే సమస్య తీరుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి ఇంకుడు గుంతల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


కుర్మిద్దలో మురుగుతో నిండిన భూగర్భ డ్రైనేజీ

ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలి



మురుగు కారణంగా దోమల బెడద అధికమవుతోంది. దాంతో ప్రజలకు డెంగీ, తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. మురుగు సమస్య తీరాలంటే ప్రతీ గ్రామంలో భారీ ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలి. ప్రతీ గ్రామానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపట్టాలి. పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపాలి.

- ఎ.నర్సింహ, మేడిపల్లి

ఘనంగా దత్త జయంతి

- భక్తిశ్రద్ధలతో గణపతి. దత్త హోమం
- ధూప హారతిలో పాల్గొన్న భక్తులు


దత్త హోమంలో భక్తులు

ఆమనగల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆమనగల్లు పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో దత్త జయంత్యుత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుదత్త జయంతి వేడుకల నేపథ్యంలో సాయిబాబా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, శోభాయామానంగా అలంకరించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు సమీప గ్రామాల సాయి భక్తులు, ప్రజలు వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సాయి నామస్మరణతో సాయిబాబా దేవాలయం మార్మోగింది. ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారికి మేలుకొలుపు పాడారు. అనంతరం సాయిబాబా మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో అలంకరించి ఆలయ నిర్వాహకులు మధుసూదనాచారి, రవికిరణ్‌ల ఆధ్వర్యంలో అర్చకులు రాజేశ్వర్‌రావు, నయనాచారి, ఆనంద్ పాండు, ఆదర్శ్ పాండేల ఆధ్వర్యంలో కాగడహారతి, మంగళస్నానం, అభిషేకం, సంస్థాన్ హారతి, అర్చనలు, అఖండ సాయి నామ సంకీర్తన, గణపతి, దత్తహోమం, ధూపం హారతి, పలకీసేవ, శేషహారతి కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, శ్వేత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన దత్త హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాలాది ఆంజనేయులు, పాపిశెట్టి కుమారస్వామి, పాపిశెట్టి రాము, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల సర్వతోముఖాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాశ్రేయస్సును కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. మండలంలోని గట్టిప్పలపల్లి, వెంకట్రావ్‌పేట, అర్లకుంట తండా, గడ్డమీది తండా గ్రామస్థులు ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డితో సమావేశమయ్యారు. గట్టిప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరు పడకల నుంచి 12 పడకలకు పెంచాలని, కల్వకుర్తి, తలకొండపల్లికి గ్రామం నుంచి వెళ్లేరోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, గట్టిప్పలపల్లి నుంచి వీరన్నపల్లి మీదుగా కొట్ర గేటు వరకు బీటీరోడ్డు నిర్మించాలని, గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే తండాలకు రోడ్లు నిర్మించాలని, గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని రోడ్ల బీటీ, మరమ్మతులు, ఆధునీకరణకు రూ.300 కోట్లు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసిన రూ.204 కోట్లతో రోడ్ల పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు కసిరెడ్డి చెప్పారు. కల్వకుర్తి అభివృద్ధికి సీఎం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాజధానికి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, మరో 1,000 ఇళ్లు అదనంగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ లు శరత్‌చంద్ర, ఆంజనేయులు, కార్యదర్శి అనిల్, రమేశ్‌నాయక్, రాజు, శ్యామల కుమార్, సురేశ్, రవీందర్, మల్లేశ్, ఖలీం, చెన్నయ్య, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్ రెడ్డి, బాబా, రవీదర్, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.


రైతుల శ్రేయస్సుకు సాహసోపేత నిర్ణయాలు


ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహను సన్మానిస్తున్న మంజులా చంద్రమౌళి, సులోచనా సాయిలు, నర్సింహ, నాయకులు


కడ్తాల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ తోడ్పాటుతో రైతులు కష్టాల నుంచి వైదొలిగి తెలంగాణ రాష్ట్రం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని, రైతుల శ్రేయస్సుకు, సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. మక్తమాదారంలో ఆదివారం చైర్‌పర్సన్ గీతకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహగౌడ్, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబోద్దీన్ ఆధ్వర్యంలో గీతను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. మక్తమాదారం గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ద్వారా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు కృష్ణ, చెన్నయ్య, నారాయణ, అరకొట కృష్ణయ్య, గణేశ్,శ్రీను, యాదగిరి, మహేశ్, యాదయ్య, చంద్రయ్య, రాజేందర్, నరేశ్‌గౌడ్, రమేశ్, నాగేశ్, ప్రభాకర్, రమేశ్, శ్రీను, సాయిలు, అంజయ్య, కన్నయ్య, యూసఫ్, నసీరోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహా పిరమిడ్ ముస్తాబు

- ఈనెల 21 నుంచి 31 వరకు వేడుకలు
- ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కైలాసపురి పత్రీజీ శక్తి స్థల్‌లో భారీ ఏర్పాట్లు
- ధ్యాన మహాయాగం చైర్మన్‌గా కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి


శోభాయమానంగా పిరమిడ్ కింగ్ చాంబర్

కడ్తాల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రమైన కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 21 నుంచి 31 వరకు కొనసాగే పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలకు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో ఈసారి వేడుకలకు, కడ్తాల ప్రాంతానికి ప్రత్యేకత సంతరించుకుంది. భారత ధ్యాన విలువలను ధ్యాన గురువు, దివంగత సుభాష్ పత్రీజీ విశ్వవ్యాప్తం చేయడానికి తన వంతు కృషి సల్పిన నేపథ్యంలో ఐక్య రాజ్య సమితి గుర్తింపు ఇవ్వడంతో ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి వేడుకలకు పెద్దఎత్తున ధ్యానులు, సందర్శకులు పెరిగే అవకాశం ఉన్నందున నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యాసకుల రాకతో పిరమిడ్ లో సందడి మొదలైంది. కాగా, పత్రీజీ పరమపదించిన అనంతరం ధ్యాన మహా వేడుకల్లో లోటు లేకుండా చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఈనెల 21 నుంచి 11 రోజుల పాటు కొనసాగే ధ్యాన సంబురాలకు తెలంగాణ, ఏపీ నుంచి ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు, సందర్శకులు, సాధకులు, ఆధ్యాత్మిక వేత్తలు, కళాకారులు తరలిరానున్నారు. దేశ, విదేశాల నుంచి కూడా ఈ వేడుకలకు పిరమిడ్ మాస్టర్లు, పలువురు కళాకారులు, అభ్యాసకులు, ఆధ్యాత్మిక వేత్తలు హాజరవుతున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కాగా, ధ్యానులు, సందర్శకులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. సరస్వతి ప్రాంగణంలో ఒకేసారి లక్ష మంది ధ్యానం చేసేలా ఏర్పాట్లు చేశారు. ప్రతీరోజు లక్ష మందికి భోజన వసతి కల్పిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ సభ్యురాలు మాధవి తెలిపారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అఖండ సంగీత ధ్యానం, పత్రీజీ వీడియో సందేశం, ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గురు సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే పిరమిడ్‌లోని సరస్వతి ప్రాంగణంలోని పత్రీజీ శక్తిస్థల్‌లో ధ్యాన వేదిక, ప్రాంగణం చలికి తట్టుకునేలా ఏర్పాట్లు ప్రారంభించారు. ఈనెల 21న సాయంత్రం 5గంటలకు పత్రీజీ సతీమణి స్వర్ణమాల పత్రీజీతో కలిసి పలువురు రాజకీయ ప్రముఖులు ఉత్సవాలను ప్రారంభిస్తారని ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు.


అభ్యాసికుల కోసం ఏర్పాటు చేసిన కాటేజీలు

గురువు పత్రీజీ కృషి ఫలితంగానే..


మాట్లాడుతున్న పీఎస్‌ఎస్‌ఎమ్ కో-ఆర్డినేటర్ మాధవి

డిసెంబరు 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించడం భారత ధ్యాన విప్లవాన్ని విశ్వవ్యాప్తం చేసిన ప్రపంచ ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కృషి ఫలితమేనని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా కో-ఆర్డినేటర్ మాధవి అన్నారు. ధ్యాన, శాకాహార విలువలను ప్రపంచ వ్యాప్తం చేసిన ఘనత పత్రీజీకే దక్కిందన్నారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో ఆదివారం విలేకరులతో మాధవి మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ 1990 లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీని స్థాపించి దేశ వ్యాప్తంగా ధ్యాన విలువలను చాటా రన్నారు. 2007లో బెంగళూరు, 2011 లో హైదరాబాద్‌లో ధ్యాన పిరమిడ్‌లను స్థాపించి తద్వారా దేశ వ్యాప్తంగా 10 వేల పిరమిడ్‌లను నిర్మించి లక్షలాది మందికి ధ్యానం నేర్పించిన పత్రీజీ చిరస్మరణీయుడని అన్నారు. మహేశ్వరం మహాపిరమిడ్ వేదికగా 2012లోనే పత్రీజీ ప్రతీయేటా డిసెంబరు 21వ తేదీని ధ్యాన దినోత్సవంగా ప్రకటించి 11 రోజుల పాటు మహాసభలు నిర్వహిస్తూ వచ్చారని గుర్తు చేశారు. కాగా, వేడుకలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ గోపాల్, హనుమంత రాజు, రాంబాబు, సాంబశివరావు, దామోదర్ రెడ్డి, నిర్మలాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కొడంగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలో కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వాజిద్‌ఖాన్ అనే వృద్ధుడు అనారోగ్యం కారణంగా ఆదివారం మృతిచెందాడు. వారం రోజుల క్రితం అమ్మనాన్న ఫౌండేషన్ ప్రతినిధులు వాజిద్‌ఖాన్ అనారోగ్యంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఆసుపత్రిలో ఆయన మృతి చెందాడు. విషయాన్ని ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ స్థానిక పోలీసులకు సమాచారం అందించి స్థానికుల సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

మనస్తాపానికి గురై..

ఫినాయిల్ తాగిన గురుకుల విద్యార్థిని


చికిత్స పొందుతున్న నందిని

దోమ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని ఫినాయిల్ తాగింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న నందిని పాఠశాలలోని తోటి విద్యార్థిని దగ్గర రూ.500 దొంగతనానికి పాల్పడిందని తోటి స్నేహితులు గేలి చేశారు. దాంతో మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగింది. కేజీబీవీ సిబ్బంది, తోటి విద్యార్థులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



పరిగిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని పరిగి డీఎస్పీ ఎస్.శ్రీనివాస్ సూచించారు. ఎస్ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం పరిగిలోని మినీస్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడాకారులకు తమవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బలాల, ఆసిఫ్, అంబేద్కర్ విజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీపీసీసీని కలిసిన నరేష్



మహేష్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరేష్

ఘట్‌కేసర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌ను ఆదివారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకుడు మెరుగు నరేష్ బోడుప్పల్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఉన్నారు.

సమీక్షిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

- పారిశ్రామిక కారిడార్ ప్రత్యేక అధికారిగా గుర్తింపు
- పాలనలో తనదైన శైలిలో అడుగులు
- 100డేస్ పూర్తి చేసుకున్న తాండూరు సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తాండూరు సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆయన శిక్షణ పూర్తిచేసుకొని తొలిసారి ఐఏఎస్ హోదాలో విధుల్లో చేరారు. అది కూడా రాష్ట్ర సరిహద్దు కర్ణాటకను ఆనుకుని ఉన్న తాండూరు డివిజన్‌కు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగం కొత్త.. భాషతోనూ కొంత ఇబ్బంది.. అయినప్పటికీ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఎవరితోనైనా ఆప్యాయంగా పలకరిస్తూ దరఖాస్తులను స్వీకరిస్తారు. యువ ఐఏఎస్‌గా సెప్టెంబరు 6వ తేదీన విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. నేటితో ఆయన విధుల్లో చేరి 100రోజులు పూర్తయింది. ఈనేపథ్యంలో యువ ఐఏఎస్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌పై ప్రత్యేక కథనం..

సమన్వయంతో సేవలు

సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పరిపాలన కొనసాగించారు. మండల, మున్సిపల్‌స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. వరిధాన్యం, పత్తి కొనుగోలు, అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు కలుగుతున్న ఆటంకాలు, రైల్వే బ్రిడ్జి నిర్మాణం, ధరణి పోర్టల్‌లను నిరంతరం సమీక్షిస్తూ గాడిలో పెట్టారు. అంతేకాకుండా డిజిటల్ ఫ్యామిలీకార్డు, సకుటుంబ సర్వేలను ఎప్పటికప్పుడు సమీక్షస్తూ, సూచనలిస్తూ విజయవంతంగా నిర్వహించారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ తాండూరులో విద్య, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాలలు, ఆస్పత్రులను తనిఖీలు నిర్వహించి నిర్లక్ష్యం చేసే అధికారులను సక్రమంగా పని చేయాలని, లేదంటే చర్యలు తప్పవని సూచిస్తున్నారు. పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్నారు. టీచర్లు సకాలంలో హాజరవుతున్నారా? లేదా? ఆస్పత్రుల్లో అందుతున్న వైద్యంపై ఆరా తీస్తున్నారు.

పారిశ్రామిక వాడ భూసేకరణాధికారిగా..

బాధ్యతలు చేపట్టిన తక్కువ సమయంలోనే కొడంగల్ నియోజకవర్గం లగచర్ల ప్రాంతంలో చేపట్టనున్న పారిశ్రామిక కారిడార్ భూసేకరణ అధికారిగా ఉమాశంకర్ ప్రసాద్‌ను నియమించారు. వివాదాస్పదమైన లగచర్ల ఘటన తర్వాత ఈ కారిడార్‌ను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో పారిశ్రామిక వాడకు భూ సేకరణ అధికారిగా నియమితులయ్యారు.

ఆప్యాయంగా దరఖాస్తుల స్వీకరణ

సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ స్వరాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్ కాగా ఆయనకు తెలుగు భాషపై అంతగా పట్టులేదు. అయినప్పటికీ తోటి ఉద్యోగుల ద్వారా తన వద్దకు వచ్చిన దరఖాసుదారుడి నుంచి ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రజావాణిలో ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 గంటలకు వరకు ఓపికగా కూర్చొని దరఖాస్తులను స్వీకరిస్తూ అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేస్తూ పరిష్కరిస్తున్నారు.

రెండో ఐఏఎస్‌గా..

గతంలో సబ్ కలెక్టర్ కార్యాలయం మొదట ఏర్పడినపుడు సందీప్ కుమార్ ఝా మొదటి ఐఎస్ అధికారి కాగా రెండవ ఐఏఎస్ అధికారిగా తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఉమా శంకర్ ప్రసాద్ బాధ్యత చేపట్టారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని తాండూరుకు ఐఏఎస్ హోదాతో సబ్ కలెక్టర్ మంజూరైంది.

క్రైం కార్నర్

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బైక్‌అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదం ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని సేడం తాలుకా గోపన్‌పల్లి గ్రామానికి చెందిన రాజునాయక్(28) ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఆదివారం స్వగ్రామానికి వెళ్లేందుకు బైక్‌పై వస్తుండగా పరిగి మండలం రంగంపల్లి శివారులోని చింతలచెరువు సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కకు ఎగిరిపడ్డారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

కొడంగల్ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేవుడి ముందు వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు కిందపడగా మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన ఈ ఘటన మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టేకుల్‌కోడ్‌లో మాల యాదమ్మ అనే మహిళ కుమారుడితో కలిసి నివాసముంటోంది. ఆదివారం పౌర్ణమి సందర్భంగా ఇంట్లో దేవుడి చిత్రపటాల ముందు పూజలు నిర్వహించి దీపం వెలిగించింది. అనంతరం ఇంటికి తాళం వేసి కూలిపనికి వెళ్లింది. మధ్యాహ్నం వేళ తాళం వేసిన ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు బిందెలతో నీళ్లు పోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న ధాన్యం బస్తాలు (జొన్నలు, బియ్యం, పప్పు) బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.30వేల నగదు మంటల్లో దగ్ధమయ్యాయి. ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో కట్టుబట్టలు మాత్రమే మిగిలాయని, ప్రభుత్వం ఆర్థికంగా దుకోవాలని బాధితురాలు మాల యాదమ్మ వేడుకుంది.

గోదాంలో అగ్ని ప్రమాదం

మూడుచింతలపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి గ్రామంలోని ఆర్‌కే గోదాంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పర్‌పల్లిలోని ఆర్‌కే డెకొరేషన్ గోదాంలోని లేబర్ రూమ్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన కూలీలు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికేమంటలు ఎగసిపడడంతో శామీర్‌పేట్ పోలీసు, ఫైర్‌స్టేషన్‌ను సంప్రదించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సుమారు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు సూపర్‌వైజర్ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

వరిగడ్డి దగ్ధం

పరిగి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. పరిగి మండలం నస్కల్ గ్రామానికి చెందిన ఎం.ఆనందం వరిగడ్డి కట్టలను ట్రాక్టర్ ద్వారా ఇంటికి తరలిస్తుండగా విద్యుత్ వైర్లు గడ్డికి తగిలాయి. దీంతో వరిగడ్డిని నిప్పులు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపు వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. దగ్ధమైన వరిగడ్డి విలువ రూ.20వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్షలు



పరిగి: గ్రూపు-2 పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు



నిమిషం ఆలస్యంతో అనుమతించకపోవడంతో పరీక్షా కేంద్రం గేటు వద్ద నిలబడిన గర్భిణి



ఘట్‌కేసర్: కొండాపూర్‌లోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలోకి వెళ్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

పరిగి,డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-2 పరీక్షలు పరిగిలో మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరిగిలోనాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. పల్లవి డిగ్రీ కళాశాల, విజ్ఞాన్‌జూనియర్ కళాశాల, న్యూబ్రిల్లియంట్ స్కూల్,కేటీఎస్ స్కూలు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 1346మంది అభ్యర్థులను కేటాయించారు. అయితే 699 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరిగిలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. పరీక్షల తీరును పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. రెండు విడతలుగా (సెషన్లుగా)పరీక్ష కొనసాగింది. రెండో రోజు సోమవారం కూడ పరీక్ష కొనసాగనుంది.

తాండూరు: పట్టణంలో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. తాండూరులో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యంతో పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన గర్భిణి వీణ పరీక్షకు దూరమైంది. ఆమె తాండూరు పట్టణం చైతన్య జూనియర్ కాలేజీలో పరీక్ష రాయాల్సి ఉంది. ఆమెతో పాటు ఆలస్యంగా వచ్చిన అరుణ, కుసమలను కూడ అనుమతించలేదు. తాండూరు డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రానికి కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి, ఎస్ఐ రమేష్‌లు గ్రూప్-2 పరీక్ష రాశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు. జిరాక్స్ కేంద్రాలను పరీక్ష సమయంలో మూసివేశారు. 11 పరీక్ష కేంద్రాలలో ఉదయం జరిగిన పరీక్షలో 3168 మంది అభ్యర్థులకు గాను 1300 మంది హాజరు కాగా 1868 మంది గైర్హాజరుకాగా 41.4శాతం మాత్రమే హజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండవ సెషన్‌లో 3168 గానూ 1310 మంది హాజరు కాగా 1858మంది గైర్హాజరు కావడంతో 41.38శాతం మాత్రమే హాజరయ్యారు. తాండూరులో 41శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మెగా ఇంజనీరింగ్ కళాశాలలో, అంకుషాపూర్‌లోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన గ్రూప్-2 పరీక్షలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పొట్రు తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాతంగా జరుగుతున్నాయా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేటి(సోమవారం) పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటనలో పరీక్షల కంట్రోలర్లు, ప్రిన్సిపాల్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలోని ఆయా కళాశాలల్లో ప్రశాతంగా జరిగాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పరీక్షలకు అభ్యర్థులను గంట ముందు నుంచే లోపలికి అనుమతించడంతో ఎలాంటి రద్దీ కనిపించలేదు. పరీక్షాకేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

కీసర: గ్రూపు-2 పరీక్షలు కీసరలో ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం జరిగిన గ్రూపు-2 పరీక్షల్లో భాగంగా కీసర పరిధి చీర్యాల్ గ్రామంలోని గీతాంజలి కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రం ఫార్మా కళాశాలలో మొత్తం 960అభ్యర్థులకు గానూ 395 హాజరు కాగా, 565 అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 792అభ్యర్థులకు గానూ 346అభ్యర్థులు హాజరు కాగా, 446మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా ఉదయం జరిగిన పరీక్షలో ఓ అభ్యర్థి ఆలస్యంగా రావడంతో నిర్వాహకులు పరీక్షకు అనుమతించలేదు.

పండగలా వ్యవసాయం

(5వ పేజీ తరువాయి)

ఒక్క పరిగి నియోజకవర్గంలోనే రూ.7,333 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అంతకుముందు ఈ సందర్భంగా రూ.5 కోట్లతో నిర్మించనున్న పరిగి మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి, రూ.6.5 కోట్లతో లక్నాపూర్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి, రూ.రెండు కోట్ల నిధులతో నిర్మించనున్న గిరిజన భవన నిర్మాణానికి, పరిగిలో రూ.20 కోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అలాగే పరిగిలో జరిగిన సీఎం కప్ విజేతలకు మంత్రులు కప్‌లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మార్కెటింగ్ డీడీ మల్లేశం, డీఎంవో సారంగపాణి, పరిగి మార్కెట్ కమిటి చైర్మన్ బి.పరుశరాంరెడ్డి, వైఎస్‌చైర్మన్ అయూబ్‌హుస్సేన్, మార్కెట్ కమిటి కార్యదర్శి విజయకిషోర్ పాల్గొన్నారు.

పాంబండలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మంత్రులు

కులకచర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ, కులకచర్ల మార్కెట్ నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలోమంత్రులు తుమ్మల, సీతక్క, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకు ముందు పాంబండ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా మైపాల్‌రెడ్డితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీఎస్.ఆంజనేయులుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి అత్యధిక నిధులు కేటాయించి దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో శీతల గిడ్డంగులను నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లాకు ట్రిబుల్ ఆర్ రోడ్డు రావడంతోతో భూములకు భారీగా డిమాండ్ పెరుగుతుందన్నారు. రైతులు ఎవరూ భూములను అమ్ముకోకూడదని సూచించారు. సీతక్క మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్, మాజీ ఎంపీపీలు సత్యమ్మ, అంజిలయ్యగౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

వికారాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీయస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా సీఎచ్ వెంకట్ రత్నం, ప్రధాన కార్యదర్శిగా రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ వికారాబాద్ కమిటీ ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీ మహాసభల సందర్భంగా 2024-26 సంవత్సరానికి గానూ జిల్లా కమిటీని 68 మంది జిల్లా కమిటీ సభ్యులతో 15 మంది కార్యదర్శి వర్గ సభ్యులతో ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులపై మానిక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

వైభవంగా మల్లికార్జున స్వామి బోనాలు



తాండూరు రూరల్: గౌతాపూర్‌లో మల్లికార్జున స్వామి ఆలయంలో బోనాల ఊరేగింపులో మహిళలు

తాండూరు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ గ్రామంలో కొలువైన మల్లికార్జునస్వామి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలో మహిళలంతా బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం రాత్రికి ఒగ్గు కథను నిర్వహించారు. ఆలయపూజారి, ధర్మకర్త పత్తి చంద్రయ్య స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అంతకుముందు ఉదయం స్వామి వారికి గంగాస్నానం చేయించి ఆలయం వరకు ఊరేగించారు. తాండూరు మాజీ జడ్పీటీసీ గౌడి మంజుల వెంకటేశం, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వీరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు రాజప్పగౌడ్, సాయిరెడ్డి, రాంలింగారెడ్డి, గౌడి వెంకటేశం, కృష్ణయ్యలు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మాణిక్ ప్రభు జాతర

నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం శ్రీమాణిక్‌ప్రభు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని పుర వీధుల మీదుగా స్వామివారి ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా రాథోడ్‌సింగ్, బలవంత్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.



నవాబుపేట: శ్రీమాణిక్ ప్రభు జాతరలో పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

అయ్యప్పస్వామి పల్లకీసేవ

పరిగి: పట్టణంలో ఆదివారం అయ్యప్పస్వామి పల్లకీసేవ వైభవంగా జరిగింది. పట్టణంలోని విధుల గుండా ఊరేగింపును నిర్వహించారు. పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ పాల్గొని పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజు, సంపత్‌స్వామి, ప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ గిరిప్రదక్షిణలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పాంబండ శివనామస్మరణతో మారుమోగింది. శ్రీ దత్తజయంతి, పౌర్ణమి సందర్భంగా ఆదివారం పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి గిరిప్రదక్షిణలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు పాండుశర్మ స్వామిదర్శనం కల్పించారు. గిరిప్రదక్షిణలో దేవాలయ కమిటీచైర్మన్ మైపాల్‌రెడ్డి, నిర్వాహకులు నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



కులకచర్ల: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

మానవాళికి భగవద్గీత మార్గదర్శనం

మేడ్చల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మానవాళికి భగవద్గీత మార్గ దర్శణమని ప్రబోధసేవా సమితి సభ్యులు అన్నారు. కిష్టాపూర్‌లో ఆదివారం లక్ష త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు గిరి, నర్సింహచారి, అమరేందర్, మధు, మహేష్, ప్రేమలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయ్యకు సన్మానం

మోమిన్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను మండల నాయకులు ఆదివారం కలిశారు. హైదరాబాద్‌లో ఆర్.కృష్ణయ్యను వారు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మయ్య మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక కావడంతో మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందర్‌నాయక్, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ

పెద్దేముల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందనెల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ భజనమండలి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది విద్యార్థులకు హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ భజన మండలి ప్రతినిధులు గాండ్ల శివకుమార్(శివన్న), హనుమంత్, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మాయాజాలం!

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు తక్కువ ధర, తూకం, తేమ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. పత్తి అమ్మకాల్లో మార్కెట్ కమిటీలు, ప్రభుత్వ శాఖల అధికారులు అసలు పట్టించుకోకపోవడంతో వ్యాపారులది ఆడింది ఆట, పాడిందే పాటగా మారింది.

తత్కాల్ నమోదు వ్యాపారులకు వరం

పత్తి రైతులకు పంట వివరాల తత్కాల్ నమోదు అవకాశం వ్యాపారులకు వరంగా మారింది. పత్తి సాగు చేసిన వివరాలు అధికారుల తప్పిదం వల్ల సాగు చేసే సమయంలో నమోదు కాలేదు. అయితే సదరు రైతు సీసీఐలో పత్తిని అమ్ముకునే పరిస్థితి లేదు. అయితే పత్తిసాగు చేసిన రైతుల వివరాలు వ్యవసాధికారుల వద్ద నమోదు చేసుకోని వారికి తత్కాల్ అవకాశం ఇచ్చారు. దీనిని ఏఈవోలు ధ్రువీకరించాల్సి ఉంది. అయితే ఈ వెసులుబాటును తమకు అనుగుణంగా మార్చుకొని వ్యాపారులు నయా దందాకు తెరలేపారు. పత్తి సాగు చేయకున్నా ఏఈవో, ఆర్ఐల వద్ద నమోదు చేయించుకుని బినామీల పేర్ల మీద పత్తి విక్రయాలు జరుపుతున్నారు. ప్రైవేట్‌గా రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేసిన పత్తిని ఎక్కువ ధరలకు సీసీఐ కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. ఇలా వ్యాపారులు అక్రమంగా రూ.లక్షలు గడిస్తున్నారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

దిగుబడి అంతంతే..

ఈ సారి జిల్లాలో దాదాపుగా 2,51,592 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. గతేడాది కంటే ఎక్కువగానే సాగే చేశారు. అయితే భారీ వర్షాల వల్ల దాదాపుగా లక్ష ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. సాగుకు అన్ని రకాలుగా అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేంది. కానీ ఈ సారి ఎకరాకు ఆరు క్వింటాళ్లలో లోపే దిగుబడి వచ్చినట్లు అంచనా. ఈ లెక్కల ప్రకారం జిల్లాలో రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు సీసీఐ ఇందులో సగం కూడా కొనుగోలు చేయలేదు. కానీ, ప్రైవేట్‌లో భారీగా కొనుగోళ్లు జరుగుతుండటం గమనార్హం. సీసీఐ పత్తి క్వింటాల్‌కు రూ.7,521లు ఉండగా, సీసీఐ అధికారులు మాత్రం తేమశాతం పేరుతో కొర్రీలు పెడుతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

వ్యాపారులు చెప్పిందే..

ఇటీవల రంగంపల్లి, పూడూరు, ధారూర్‌లలో జిన్నింగ్ మిల్లుల్లో రైతులు ఆందోళనకు దిగారు. అయితే తేమశాతం పేరుతో కొర్రీలు పెట్టడం, మిల్లుల్లో ప్రైవేట్ వ్యాపారులు రైతుల దగ్గర రూ.6,000ల నుంచి రూ.6,500 వరకు కొనుగోలు చేసి దాన్ని సీసీఐలో రూ.7,521లకు అమ్ముకుంటున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి అమ్ముకునేందుకు మార్కెటింగ్ శాఖ యార్డుల్లో వసతులు కల్పించి వేలం ద్వారా రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది జిల్లాలో ఎక్కడ కూడా అమలు కావడం లేదు. పత్తి అమ్మకాల్లో మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే బయట అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షలో జరుగాల్సిన పత్తి అమ్మకాలు జిన్నింగ్ మిల్లుల్లోని నాలుగు గోడల మధ్యనే సాగిపోతున్నాయి. దీంతో వ్యాపారులు చెప్పిందే అధికారులు రాసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గౌడవెల్లిలో ఆదివారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడవెల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్.వినోద్ గౌడ్, నాయకులు రాజు గౌడ్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

తాండూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణానికి పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఆదివారం తాండూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని సావుకార్‌పేటలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆనంపల్లి శ్రీనివాస్, ప్రతినిధులు వీరేందర్, తరళపల్లి భానుకుమార్, ఐనాపురం అనిల్ గుప్తా, టి. ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అండగా సీఎంఆర్ఎఫ్

బొంరాస్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లికాన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సమ్మకు మంజూరైన రూ.45వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిలయ్య, కృష్ణ, మల్లికార్జున్, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.